www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 29 నవంబర్ 2024

మే ఐ హెల్ప్ యు కౌంటర్లు పెట్టాలి

జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు ఆదేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ మే ఐ హెల్ప్ యు కౌంటర్లు పెట్టాలని జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లందరికీ ఆదేశించినట్లు జిల్లా రిజిస్టర్ కె.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దస్తావేజుకు సంబంధించి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ ఛార్జీల వివరాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పట్టిక రూపంలో ప్రదర్శించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలు నిషేదిత ఆస్తుల జాబితాను, రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలను Igrs.ap.gov.insite ద్వారా గాని నేరుగా సబ్ రిజిస్ట్రార్ వారిని, జిల్లా రిజిస్ట్రార్ వారిని సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలు మధ్యవర్తులను, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని జిల్లా రిజిస్టర్ తెలిపారు.

ముమ్మరంగా.. ధాన్యం కొనుగోళ్లు..!

48 గంటల్లోపే ధాన్యం సొమ్ములు జమతో రైతులు హర్షం

ఏలూరు జిల్లాలో లక్షా 23 వేలు, 'పశ్చిమ'లో లక్షా పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రెండు జిల్లాల్లో సరాసరిన 40 శాతం వరకూ ఖరీఫ్ కోతలు పూర్తి

మరో పది రోజుల్లో ధాన్యం కొనుగోలు చాలా వరకూ పూర్తయ్యే అవకాశం

సంచి బరువు 600 గ్రాములుగా తూకంపై ప్రత్యేకంగా అధికారుల దృష్టి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ముమ్మరంగా సాగుతోంది. గతకంటే సులువుగా ధాన్యం కొనుగోలు సాగుతుండడం, 48 గంటలు గడవకముందే ధాన్యం సొమ్ములు రైతుల ఖతాల్లో జమవుతుండడంతో రైతులు ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఏలూరు జిల్లాలో లక్షా 92 వేల ఎకరాలు, పశ్చిమలో రెండు లక్షల ఐదు వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం ముమ్మరంగా ఖరీఫ్ మాసూళ్లు సాగుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ దాదాపు 40 శాతం వరకూ వరి కోతలు పూర్తయ్యాయి. ఏలూరు జిల్లాలో 250, పశ్చిమలో 231 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో లక్షా 23 వేల మెట్రిక్ టన్నులకు సంబంధించి రూ.281 కోట్ల వరకూ ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. ఇప్పటివరకూ రూ.156 కోట్ల సొమ్ములు రైతుల ఖాతాల్లో జమకాగా, రూ.122 కోట్లకు సంబంధించి ప్రోసెసింగ్ ప్రక్రియలో ఉందని ఒకటి, రెండు రోజుల్లోనే జమకానున్నాయని అధికారులు తెలిపారు. 'పశ్చిమ'లో లక్షా పది వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూ.256 కోట్లు ధాన్యం కొనుగోలు జరిగింది, ఇప్పటి వరకూ రూ.250 కోట్ల వరకూ రైతుల ఖాతాల్లో జమైన పరిస్థితి నెలకొంది. ధాన్యం విక్రయించిన వెంటనే సొమ్ములు రైతుల ఖాతాల్లో జమవుతుండడం రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో సొమ్ములు జమ చేస్తామని చెప్పినా రైతులు నెలల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితులు కొనసాగాయి. ధాన్యం సొమ్ముల కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేసిన పరిస్థితి కొనసాగింది. అంతేకాకుండా తేమశాతం, వాహనాల కొరత, సంచుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేస్తోంది. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే సొమ్ములు జమ చేస్తామని ప్రభుత్వం ముందుగానే చెప్పింది. ప్రభుత్వం చెప్పిన దానికంటే ముందుగానే సొమ్ములు జమవుతుండడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తేమ శాతంలో ఇబ్బందులు, సంచుల కొరత లేకపోవడంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ మాసూలు సాగిస్తున్నారు. గతంలో ప్రభుత్వం నిర్దేశించిన మిల్లులకు మాత్రమే ధాన్యం విక్రయించాల్సి వచ్చేది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకపోవడం, రైతులు తమకు నచ్చిన మిల్లును ఎంచుకునే అవకాశం ఉండడంతో రైతులకు ధాన్యం అమ్ముకోవడంలో స్వేచ్ఛ లభించింది. సీజన్ పూర్తయ్యే వరకూ ఇదేవిధంగా ధాన్యం సొమ్ములు జమచేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. అలాకాకుండా ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రభుత్వం రైతుల విశ్వాసాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడనుంది.

తూకంపై అధికారుల ప్రత్యేక దృష్టి..

ధాన్యం కొనుగోలు వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పరిస్థితి కనిపిస్తోంది. అధికారులు ధాన్యం కొనుగోలుపై అప్రమత్తంగా ఉంటూ ముందుకు సాగుతున్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య ఉందని పత్రికల్లో వస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నారు. అంతేకాకుండా రైతులకు మేలు జరిగే విధంగా ధాన్యం తూకంపైనా అధికారులు దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షిస్తున్న పరిస్థితి నెలకొంది. గతంలో 40 కిలోలకు గాను సంచి బరువుతో కలిపి 41 కిలోలు తూకం తూసేవారు. సంచి బరువు 600 గ్రాములుగా మాత్రమే గుర్తించి తూకం 41 కిలోల 600 గ్రాములే ఉండాలని ప్రభుత్వం పేర్కొంది. దీంతో క్షేత్రస్థాయిలో దీన్ని అమలు చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించిన పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలోని వ్యవసాయ అధికారులు రైతులకు దీనిపై అవగాహన కల్పించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇది రైతులకు ప్రయోజనం కలిగిస్తోంది. తూకంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంపై రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. ముమ్మరంగా ఖరీఫ్ మాసూలు సాగుతుండడంతో మరో పది రోజుల్లో చాలా వరకూ ధాన్యం కొనుగోలు పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

48 గంటల్లోపే ధాన్యం సొమ్ములు జమవుతున్నాయి

శ్రీలక్ష్మి, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్

ధాన్యం విక్రయించిన 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ములు జమవుతున్నాయి. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో లక్షా 23 వేల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు జరిగింది. రూ.281 కోట్లు ధాన్యం సొమ్ములకు గాను ఇప్పటివరకూ రూ.156 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. మిగిలిన సొమ్ము ప్రోసెసింగ్‌లో ఉంది. గురువారం సాయంత్రానికి, శుక్రవారంలో జమవుతాయి. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సాఫీగా ధాన్యం కొనుగోలు జరుగుతోంది.

30నే పింఛన్ల పంపిణీ

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను డిసెంబర్1వ తేదీ ఆదివారం సెలవు కారణంగా ఈనెల 30వ తేదీనే లబ్ధిదారులకు చెల్లించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు ఆదేశించారు. డిసెంబర్ 1వ తేదీన ఆదివారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం నవంబర్ 30వ తేదీ ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని, ఏదైనా కారణం చేత ఆరోజు తీసుకోని వారికి 2వ తేదీన పంపిణీ చేయాలని తెలిపారు. జిల్లాలో డిసెంబర్‌లో 2,62,836 మంది పింఛనుదారులకు 112.68 కోట్ల రూపాయలు పంపిణీ చేయాల్సి ఉండగా ఈ నెల 30న నూరు శాతం పంపిణీ జరగాలని దానికి అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో డిసెంబర్ నెల పింఛన్లు ఒక రోజు ముందుగా ఇస్తున్న విషయాన్ని పింఛనుదారులకు వ్యక్తిగతంగా తెలియజేయాలని తెలిపారు. పింఛను పంపిణీ సిబ్బంది 5,298 మంది తప్పకుండా ఉదయం 6 గంటలకు పంపిణీ ప్రారంభించాలన్నారు. ఎక్కడా పొరపాటు జరగకుండా పింఛన్ల పంపిణీ జరగాలని, జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ, జిల్లా పరిషత్ సిఇఒ ఆర్.విజయరాజు, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పాల్గొన్నారు.

క్రీడలను ప్రారంభిస్తున్న ప్రసన్న వెంకటేష్

విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యతివ్వాలి

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - పెదవేగి

విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతివ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. పెదవేగిలోని బిఆర్ అంబేద్కర్ గురుకులంలో రాష్ట్రస్థాయి క్రీడల పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో విజయం అనేది నిరంతర అభ్యాసంతో సాధ్యపడుతుందన్నారు. ఉపాధ్యాయులు క్రీడల పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులను గుర్తించి వారిని మరింత ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యతోపాటు, క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతిస్తోందన్నారు. క్రీడల అభ్యాసనకు అవసరమైన బూట్లు, క్రీడా సామగ్రిని ఆసక్తి ఉన్న విద్యార్థులకు అందిస్తోందన్నారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయుల వివరాలు, ఫొటోలతో సహా తమ శాఖ ప్రచురించే మ్యాగ్‌జైన్‌లో ప్రచురించి మరింత ప్రోత్సహిస్తామన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని ఎంత డబ్బు ఉన్నా ఆరోగ్యాన్ని కొనలేమని కోవిడ్ అందరికీ పాఠాలు నేర్పిందన్నారు. గతంలో అందరూ పాఠశాలల్లో ఎన్నో రకాల క్రీడల ప్రాక్టీస్ చేసేవారని, పెద్దలు కూడా శారీరక శ్రమతో ఎంతో ఆరోగ్యంతో ఉండేవారని తెలిపారు. ప్రస్తుతం టివిలు, వీడియో గేమ్‌లు, స్మార్ట్ ఫోనుల్లో గేమ్‌లతో సరిపోతుందని, ఎటువంటి శారీరక శ్రమ లేని కారణంగా శారీరక ధృఢత్వం లేకుండాపోతుందన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులు స్మార్ట్ ఫోన్ జాడ్యం లేకపోవడంతో నిజమైన క్రీడలను అభ్యసిస్తున్నారని, ఇది ఆనందించదగిన విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌డబ్ల్యూఆర్‌ఇఐ సంస్థ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎన్.సంజీవరావు, ఎ.ముళ్ల కృష్ణ, మల్లేశ్వరరావు (ఎఎంఒ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి.

గిట్టుబాటు ధర ఇవ్వాలి

ఎంఎల్‌ఎకు భూ నిర్వాసిత రైతుల వినతి

ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూ నిర్వాసిత రైతులు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల గురించి ప్రభుత్వంతో చర్చించి గిట్టుబాటు ధర అందిస్తామని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద ఎంఎల్‌ఎను కలిసిన భూ నిర్వాసిత రైతులు గిట్టుబాటు ధర ఇవ్వాలని గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించాలనేది తన ఆలోచన అని, శాసనసభలో కూడా అదే మాట్లాడానని తెలిపారు. రైతులు కూడా విశాల దృక్పథంతో ఆలోచన చేయాలని, తాత్కాలికంగా కొంత నష్టం జరిగినా శాశ్వత ప్రయోజనాలు చేకూరుతాయని ఆలోచించాలని కోరారు. ఇప్పటికే రైతాంగానికి కొంతమేర నష్టం జరిగిందని, మభ్యపెట్టే మాటలను ఎవరు నమ్మొద్దని, ఎత్తిపోతల పథకం పూర్తి చేయడానికి కలిసికట్టుగా ముందుకు సాగుదాం అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు

ఇవిఎం గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఇవిఎం గొడౌన్‌లో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు

కలెక్టరేట్‌లోని ఇవిఎం యంత్రాలు, వివిప్యాట్‌లు భద్రపర్చే గొడౌన్‌ను గురువారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎం గొడౌన్ తనిఖీలో భాగంగా ఇవిఎం గొడౌన్ తాళాలు, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం సెక్యూరిటీ లాగ్ బుక్‌ను పరిశీలించి అందులో సంతకం చేశారు. ఇవిఎం గొడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

తుపాన్ హెచ్చరికలతో రైతుల్లో గుబులు

కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యపు రాశులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో మండల రైతుల గుండెల్లో రైళ్లు పరు గెడుతున్నాయి. దీంతో మండలంలో సార్వా వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంటను పండిస్తే ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురిస్తే పంట దిగుబడులపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని, దీంతో తాము ఆర్థికంగా నష్టపోతామని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే మండలంలో గరువు గ్రామాల్లో యంత్రాలతో కోతలు కోసి కల్లాల్లో, పొలం గట్లపైన, రహదారుల వెంబడి పరదాలపై ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుతున్నారు. కూలీలతో కోసిన వరి కోతలు చేల్లో పనలపై ఉన్నాయి. ఈ తరుణంలో వర్షాలు కురిస్తే ఇంకా కొయ్యని వరి చేలు నేలకొరిగి నీటిపాలయ్యే ప్రమాదం ఉందని, పనలపై ఉన్న పైరు తడిసి రంగు మారే ప్రమాదం ఉందని రైతులు దిగాలు చెందుతున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిచే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మండలంలో ఆక్వా సాగు 15 వేల పైబడి ఎకరాల్లో సాగు అవుతుంది. వాయుగుండం ప్రభావంతో వాతావరణంలో మార్పులు రావడంతో మండలంలోని చేపల, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

పని భారం తగ్గించి మమ్మల్ని ఆదుకోండి

గ్రామ పంచాయతీ కార్యదర్శుల వినతి



వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామపంచాయతీ కార్యదర్శితో పాటు, గ్రామ సచివాలయాల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్న తమపై పని భారం తగ్గించాలని, ఒత్తిళ్లతో, పెరిగిన పని భారంతో తమ ఆరోగ్యం పాడైపోతుందని తమను ఆదుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శుల యూనియన్ పిలుపుమేరకు భీమడోలు మండల పరిషత్ అధికారికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇబ్బందులు లేకుండా గ్రామపంచాయతీ పరిపాలన సజావుగా కొనసాగేందుకు ప్రజా ప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గాల సహకారం తీసుకుంటూ తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు. పంచాయతీల ద్వారా వివిధ పనుల నిర్వహణకు నిధులు ఖర్చు చేసే అవకాశం లేనందున వ్యక్తిగతంగా సదరు ఖర్చును భరిస్తున్నట్లు తెలిపారు. వివిధ సర్వేలను సకాలంలో పూర్తి చేసేందుకు తమ సెలవు దినాల్లో సైతం పని చేస్తున్నట్లు తెలిపారు. తమ మాతృసంస్థ కేటాయించిన పనులతో పాటు పంచాయతీరాజ్ చట్టానికి చెందిన ఇతర పనులు, అనుబంధ పనులు, వివిధ యాప్‌ల నిర్వహణ, ఇతర పనులను చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కార్యక్రమాల నిర్వహణ, పారిశుధ్య పనుల నిర్వహణకు ఒకొక్క సమయంలో సొంత నిధులను ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు. హౌస్‌హోల్డ్ సర్వే, ఎన్‌పిసిఐ సర్వేలు, బాధ్యతల నుంచి కొన్ని శాఖలు తప్పుకున్నప్పటికీ వాటిని సైతం గ్రామపంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్నారని, వారిపై పనిభారం పెరుగుతుందని చెప్పారు. ఈ విషయమై కొన్ని పర్యాయాలు క్రమశిక్షణ చర్యల బారిన పడాల్సి వస్తుందని తెలిపారు. వీటన్నింటి నుంచి తమకు రక్షణ కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సర్పంచి మృతి

ములకలపల్లిలో విషాదఛాయలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

కోటేశ్వరరావు (ఫైల్ ఫొటో)

మండలంలో ములకలపల్లి గ్రామ సర్పంచి నువ్వుల కోటేశ్వరరావు (57) గురువారం గుండెపోటుతో మరణించారు. అర్ధరాత్రి సమయంలో గుండె నొప్పి రావడంతో కోటేశ్వరరావును కుటుంబ సభ్యులు కలిదిండిలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. సర్పంచిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరం రిఫర్ చేశారు. దీంతో 108 వాహనంలో కోటేశ్వరరావును భీమవరం తరలిస్తుండగా భీమవరం టౌన్ సమీపంలో సర్పంచి మృతి చెందారు. తొమ్మిదేళ్ల క్రితం సర్పంచికి బైపాస్ సర్జరీ జరిగింది. కోటేశ్వరరావు రైల్వేలో ఎ వన్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నారు. సర్పంచి అకాల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మాజీ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు మృతదేహాన్ని సందర్శించి అంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య

జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

క్రీడల వల్ల శారీరక దృఢత్వమే కాకుండా మానసిక ఉల్లాసం, పోటీతత్వం పెరుగుతుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ జిల్లా వీరభద్రరావు 88వ పుట్టినరోజు సందర్భంగా స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఏలూరు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ - 2024 పోటీలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంఎల్ఎ రాధాకృష్ణయ్య మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా క్రీడాకారులంతా పోటీతత్వం ప్రదర్శించాలని సూచించారు. ఏలూరు స్టేడియం అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తామని తెలిపారు. అసోసియేషన్ సెక్రటరీ దేవరపల్లి ప్రసాద్ మాట్లాడుతూ సుమారు 400 మంది బాలబాలికలు వివిధ పాఠశాలల నుంచి ఈ పోటీలో పాల్గొంటున్నారని, 8, 10, 12, 14, 16 సంవత్సరాల విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాల్గొన్న ప్రతిఒక్కరికీ సర్టిఫికెట్, గెలుపొందిన విజేతలకు బహుమతులు అందిస్తారని తెలిపారు. క్రీడా పోటీలకు ముందు జిల్లా వీరభద్రరావు దంపతులచే కేక్ కట్ చేయించి వారిని ఘనంగా సన్మానించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు, ఎపి అథ్లెటిక్ అసోసియేషన్ కోశాధికారి చింతకాయల సత్యనారాయణ, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ వైర్లు

సరిచేయాలని యువకుల వినతి

వినతిపత్రం అందిస్తున్న యువకులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రామంలో ప్రమాధబరితంగా ఉన్న విద్యుత్ వైర్లు సరి చేయాలని కోరుతూ పుట్రేపు గ్రామానికి చెందిన యువకులు గురువారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ ఎఇకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి వచ్చే రోడ్డు మార్గంలో, గ్రామంలో రెండు చోట్ల విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి పోయాయని, దీంతో విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయని చెప్పారు. వైర్లు కిందకు వేళాడుతూ ఉండడం వల్ల పెద్ద వాహనాలు వెళ్లినప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని వాహనదారులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రమాధభరితంగా ఉన్న విద్యుత్ వైర్లు సరిచేయాలని, స్తంభాలు నిలబెట్టి సమస్య పరిష్కారించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బాణాల నాగేంద్ర, కట్టూరి నాగరాజు, గుర్రం రాము, కాటిక ఏలియా, తదితరులు ఉన్నారు.

అటవీ శాఖ ప్లాంటేషన్ల వద్ద నిఘా పెంచాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అటవీ శాఖ ప్లాంటేషన్ల వద్ద నిఘా పెంచాలని జంగారెడ్డిగూడెం అటవీ శాఖ రేంజ్ అధికారి దుర్గకుమార్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా జీలుగుమిల్లి బీట్, రామన్నపాలెం విఎస్‌ఎస్ పరిధిలో చంద్రమ్మ కాలనీ, బర్రింకలపాడు అటవీ శాఖ ప్లాంటేషన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపద అన్యాక్రాంతం కాకుండా అటవీ శాఖ ప్లాంటేషన్ల వద్ద నిఘా పెంచాలని సిబ్బందికి ఆదేశించారు. అటవీశాఖ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు డిఆర్ఒ ధర్మారావు, బీట్ అధికారులు మారేష్, లలిత, సిబ్బంది రాఘవులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

ప్రజాశక్తి - చింతలపూడి

ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. మండలంలో మండల వ్యవసాయ ఉప సంచాలకుల కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో లేని విధంగా రైతులకు ధాన్యం కొనుగోలు విషయంలో ముందుగానే అన్ని చర్యలు తీసుకున్నామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా టోల్ ఫ్రీ సెంటర్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. రైతుకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 7, 8 శాఖలు సమన్వయంతో పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ నాగ కుమార్, నాలుగు మండలాల ఎఒలు పాల్గొన్నారు.

హక్కులు కాలరాయొద్దు : యుటిఎఫ్

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధ్యాయ సంఘాలు తీసుకొచ్చిన హక్కులను కాలరాయొద్దని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జి.పద్మశ్రీ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయి అధికారులు, విద్యాశాఖలోని ఉన్నతాధికారులు పెట్టే ఒత్తిడి తట్టుకోలేక ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఇటీవల కాలంలో ఉన్నతాధికారుల నుంచి వస్తున్న మౌఖిక ఆదేశాలనుసారం మండలాన్ని యూనిట్‌గా తీసుకొని పది శాతం ఉపాధ్యాయులు మాత్రమే సెలవులు ఉపయోగించుకోవాలంటున్నారని ఉపాధ్యాయుల మీద తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఎవరైనా చనిపోతేనో యాక్సిడెంట్ అయితేనో మాత్రమే సెలవులు ఉపయోగించుకొనే పరిస్థితి జిల్లాలోని ఒక మండల విద్యాశాఖాధికారి అనటం శోచనీయమని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుడిమెళ్ల రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

సేవా కార్యక్రమాల కోసం భాస్కర్ విరాళం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగే సేవా కార్యక్రమాలు తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్త మార్పిడి, మందులు, భోజనాలు ఉచితంగా అందించడం, శీతాకాలంలో నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ చేయడం తదితరవాటికి స్పందించి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ లీగల్ ఆఫీసర్ నండూరి విశ్వనాథ భాస్కర్ రూ.పదివేల విరాళం అందించినట్లు ఇండియన్ రెడ్ క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విరాళం అందించిన దాతకు ఇండియన్ రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

పెదగొన్నూరులో సీసీ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదగొన్నూరు గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన పలు సీసీ రోడ్లను కైకలూరు ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. డాక్టర్ కెఎల్.నారాయణ ఫౌండేషన్ ద్వారా పెదగొన్నూరు గ్రామం కలిపి 30 బెంచ్ బల్లలు,

సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్

గ్రామ ప్రజల మంచినీటి అవసరాలకు మంచినీటి ట్యాంకర్‌ను ఎంఎల్ఎ కామినేని శ్రీనివాసరావు చేతులమీదుగా గ్రామపంచాయతీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెఎల్.నారాయణ ఫౌండేషన్ కన్వీనర్ జి.వేణు, గ్రామ సర్పంచ్ తాడిశెట్టి శిరీష రాజేష్, ఎంపిడిఒ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి గిరిజ, టిడిపి కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, డాక్టర్ ఈడుపుగంటి శ్రీనివాస్, పెదగొన్నూరు గ్రామపంచాయతీ మాజీ సర్పంచి నాగిరెడ్డి శివప్రసాద్, పంచాయతీ రాజ్ ఎఇ బాపు, ఎన్డిఎ కూటమి నాయకులు, గ్రామ ప్రముఖులు, గ్రామ ప్రజలు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మైసాక్షి వెంకటాచారి, కూరాకుల బాబూరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బెస్తగూడెం సచివాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలకు గ్రామాల్లో రెండు, పట్టణాల్లో మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలన్నారు. పోలవరం ముంపులో లేని భూములకు వ్యవసాయ రుణాలతో పాటు రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు ఇవ్వాలని కోరారు. కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి పత్తి రైతులు దళారుల చేతిలో నష్టపోకుండా చూడాలని కోరారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, మహేష్, కంటిపల్లి లక్ష్మి, వెంకటరమణ, సత్యవతి పాల్గొన్నారు.

పిఎం ఫసల్ బీమా యోజనను వినియోగించుకోండి

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.శివశంకర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐసిఐసిఐ లాంబార్డ్ కంపెనీ తెలియజేసిన విధంగా వరి ఎకరానికి రూ.500, మొక్కజొన్న రూ.483, పెసర, మినుము రూ.60 చొప్పున ఎకరానికి ప్రీమియం డిసెంబర్ 31వ తేదీ నాటికి రైతులు చెల్లించి బీమాను పొందాలని తెలిపారు.

విద్యార్థులకు పోస్టర్ పెయింటింగ్ పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు

ఏపి ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ప్రపంచ ఎయిడ్స్ దినం డిసెంబర్ ఒకటో తేదీన ప్రతి ఏడాది ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో 28వ తేదీ గురువారం 9, 10, ఇంటర్ విద్యార్థులకు హెచ్ఐవి/ఎయిడ్స్ అంశంపై పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మొత్తం 81 మంది విద్యార్థులు వివిధ స్కూల్, కాలేజీల నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారి వారు మాట్లాడుతూ యువత హెచ్ఐవి పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ ఎస్.విజయలక్ష్మి, ఎన్జిఒ సిబ్బంది పాల్గొన్నారు.

8న మాదిగల ఐక్య ఆత్మీయ సమ్మేళనం

ఆగిరిపల్లి :నూజివీడు నియోజకవర్గ మాదిగల ఐక్య ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం వచ్చే నెల 8వ తేదీన ఆగిరిపల్లిలో నిర్వహించనున్నట్లు నల్లమోతు కాంచనరావు మాదిగ, కంబాల ప్రదీప్ మాదిగ కోరారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమానికి మాదిగల ముద్దు బిడ్డ మన్మర్తి మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

నేరాలు – ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మద్యం తాగవద్దని కుటుంబ సభ్యులు మందలించినందుకు వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని పి.అంకంపాలెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సూర్యనారాయణ అనే వ్యక్తి అతిగా మద్యానికి బానిస అవుతున్నాడని కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో సత్యనారాయణ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆటోలో కామయ్యకుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నాటుసారా స్థావరంపై దాడి

కుక్కునూరు : మండలంలోని వేలేరు గ్రామ శివారులో నాటుసారా స్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉద్యోగాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గంలో యువత మంచి చదువులు చదివి ఉద్యోగ వకాశాలు రాక ఇబ్బందులు పడుతున్నారని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద చింతలపూడి నియోజకవర్గ యువతకు ఉద్యోగాల కల్పన కోసం ప్రయివేట్ కంపెనీలతో భాగస్వామ్యం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 139 మంది నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఈ పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండి ఏ అవకాశాలు రాక మరుగున పడిన నిరుద్యోగులను గుర్తించి మంచి ఉన్నత స్థితికి తీసుకెళ్లాలని ఆశయంతో పనిచేస్తున్నానని చెప్పారు.

శ్రీవారికి రూ.1.84 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఏలూరు జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలు గురువారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ హుండీల ద్వారా స్వామి వారికి గడచిన 17 రోజులకు రూ.1,84,31,118 ఆదాయం వచ్చింది. భక్తుల కానుకల రూపేణ 381 గ్రాముల బంగారం, నాలుగు కేజీల 485 గ్రాముల వెండి, రెండు పాత రూ.500 నోట్లు, ఒక రూ.వెయ్యి, నాలుగు రూ.2000 నోట్లు, పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సిజిఆర్ఎఫ్, ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 01:30 వరకు జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని కొయ్యలగూడెం సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కార్యదర్శి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని తెలిపారు. ఈ సమావేశానికి సిజిఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.మసిల మణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్ హాజరవుతారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు సెక్షన్ పరిధిలో ఉన్న 33 కెవి అశోక్‌నగర్ సబ్‌స్టేషన్ మరమ్మతులు చేసే నేపథ్యంలో ఈ నెల 29వ తేదీ శుక్ర వారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఏలూరు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్‌ఆర్.పేట, నాలుగు గుళ్ల సెంటర్, పానుగంటి వారి వీధి, అతిథి హోటల్ రోడ్ శంకరమటం, విజయ విహార్ సెంటర్, అమీనపేట, అశోక్ నగర్, పత్తేబాద, మోతేవరితోట, దాసరి ఎర్రయ్యవీధి, నరసింహారావు పేట, పవర్ పేట, పోలీస్ క్వార్టర్స్, ప్రభుత్వ హాస్పిటల్ ఏరియా, కలెక్టర్ ఆఫీసు ఏరియా, జెడ్‌పి ఆఫీసు ఏరియా, రంగూన్ మేడ రోడ్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

భీమడోలు :సూరప్పగూడెం 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్ కో భీమడోలు ఎడిఇ గోపాలకృష్ణ తెలిపారు. వీటితో పాటు విద్యుత్ సరఫరాకు ఆటకంగా ఏర్పడిన చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియను చేపట్టనున్నామన్నారు. ఈ క్రమంలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కురెళ్లగూడెం గ్రామ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఇదేవిధంగా భీమడోలు బస్టాండ్‌తో పాటు, భీమడోలు జంక్షన్, పొలసానిపల్లి గ్రామాల పరిధిలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎడిఇ తెలిపారు.

23 వరకూ రెండు విడతలుగా విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి - ఏలూరు

భీమడోలు–ఏలూరు ఫీడర్ ప్రస్తుతం ఉన్న 132 కెవి కండక్టర్ మార్పు చేయడం కారణంగా డిసెంబర్ 23వ తేదీ వరకు వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు రోజు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ ఏలూరు సర్కిల్ ఆపరేషన్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. 132/33 కెవి విద్యుత్ ఉపకేంద్రం, ఏలూరు పరిధిలోని విద్యుత్ ఉపకేంద్రాలకు చెందిన వ్యవసాయ విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని అంబేద్కర్ కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి సాగు రైతులు అప్రమత్తంగా ఉండి వరి కోతలు వాయిదా వేసుకోవాలని నూజివీడు మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి రైతులకు సూచించారు. వరి కోసి కళ్లల్లో ఉన్న ధాన్యాన్ని రైతు సేవా కేంద్రంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించుకోవచ్చని తెలిపారు. పోతురెడ్డిపల్లి, ముక్కెళ్లపాడు, పడమర దిగవల్లిలో ధాన్యాన్ని ఆరబెట్టుకుని ఉంచిన రైతులను అప్రమత్తం చేసి వెంటనే కొనుగోలు కేంద్రానికి తరలించాలని సూచించారు.

మానవత సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

వివిధ సందర్భాల్లో చోటు చేసుకున్న సంఘటనల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ఆదుకునే క్రమంలో కనీస సహకారం అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. మండల పరిధిలో మానవత శాఖ వివిధ కార్యక్రమాలను చేపట్టింది. దీనిలో భాగంగా ఇటీవల కాలంలో జాతీయ రహదారిపై దువ్వ వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరు కాలును కోల్పోయారు. ఈ నేపథ్యంలో సదరు ప్రమాదం కారణంగా వడ్లపట్ల గ్రామంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆరు కుటుంబాల వారికి చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయాన్ని మానవత సభ్యులు శుక్రవారం అందించారు. భీమడోలుకు చెందిన శ్రీ సాయిరాం క్లాత్ స్టోర్స్ సదరు కుటుంబ సభ్యులకు దుస్తులు, నిత్యావసరాలను సమకూర్చారు. భీమడోలు నిర్మించిన శాఖ కార్యాలయానికి నీటి వసతి కల్పన కోసం రూ.1.40 లక్షలు ట్యాంకు ఏర్పాటుకు అందించిన రామిశెట్టి పుల్లారావును శాఖ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పక రాంబాబు, ఆర్.గంగాధరరావు, పంచకర్ల సత్యనారాయణ, గుళ్ల నూకరాజు దంపతులు పాల్గొన్నారు.

సహకారం అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

పోతురెడ్డిపల్లిలో స్థల వివాదం పరిష్కారం

గ్రామస్తుల హర్షం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని పోతురెడ్డిపల్లి గ్రామంలో ఉన్న అంకమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సంబంధించి స్థల వివాదాన్ని అధికారులు పరిష్కరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని మడుపల్లి వెంకట నాగేంద్రరావు, వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ 1971 మార్చి 15న 2.15 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 150 కుటుంబాలుగా ఉన్న తమ సంఘం ప్రయోజనం కోసం వినియోగించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే సంఘ సభ్యులందరి ఆమోదంతో ఏప్రిల్ 26వ తేదీన అంకమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. అప్పటివరకు అందరితో సహకరించిన తమ సంఘంలోని మూడు కుటుంబాలకు చెందిన సభ్యులు విభేదించి ఆలయ స్థలంలో తమకు నడిచే దారి హక్కు ఉన్నదంటూ లేని వివాదాన్ని సృష్టించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేయగా పరిష్కారం కాలేదన్నారు. పోలీసు శాఖ వారికి పలుమార్లు స్థల వివాదాన్ని సృష్టించిన వ్యక్తులపై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇటీవల కాలంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి గ్రామంలోని ఆలయ నిర్మాణంలో స్థల వివాదాన్ని సృష్టిస్తున్న వ్యక్తుల విషయమై వివరించినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణాల్లో వివాదాలకు తావు ఉండకూడదని, వాస్తవాలు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని మంత్రి పార్థసారధి ఆదేశించడంతో రెవెన్యూ, పోలీసు శాఖ యంత్రాంగం కదిలి వచ్చినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో నూజివీడు ఆర్‌డిఒ ఆధ్వర్యంలో తహశీల్దార్ సమక్షంలో రెవెన్యూ, సర్వే శాఖకు చెందిన సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వివాదానికి తావు లేదని సంఘానికి చెందిన ఆలయ నిర్మాణానికి చెందిన స్థలంగానే అధికారులు నిర్ధారించినట్లు చెప్పారు. ఆలయ నిర్మాణాన్ని అనుక్షణం అడ్డుకుంటున్న చిల్లి ముంత శ్రీనివాసరావు, ఏడుకొండలు, భాను, ఉప్పలపాటి భాస్కరరావులకు వివాదం రేకెత్తించిన స్థలంలో ఏమాత్రం హక్కు లేదని ఆధారాలతో నిర్ధారిస్తూ రెవెన్యూ శాఖ అధికారులు ఎండార్స్‌మెంట్ ఇచ్చినట్లు తెలిపారు. అధికారులు ధ్రువీకరించిన పత్రాలను పాత్రికేయులకు చూపారు. ఈ కుటుంబాలకు చెందిన వారు నివేశన స్థలాల కొనుగోలు సమయంలో దక్షిణం వైపు మాత్రమే దారి ఉంటుందని స్పష్టంగా తెలియజేసినట్లు వివరించారు. వివాదం సద్దుమనగడంతో రెవెన్యూ, సర్వే శాఖ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం స్థలాన్ని గుర్తించి అప్పగించడం వల్ల సంఘ సభ్యులు ఆలయ స్థలానికి ఫెన్సింగ్ వేశారు. త్వరలోనే ప్రహరీ గోడలు నిర్మించి, అమ్మవారి ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సంఘ సభ్యులకు ఎవరిపైన కోపం లేదని, ఈ కార్యక్రమం ఏ ఒక్కరి ఇంట్లోది కాదని, సంఘ సభ్యులందరి ఆమోదంతో అమ్మవారి ఆలయ నిర్మాణానికి నడుం బిగించినట్లు స్పష్టం చేశారు.

గానొడెర్మా తెగులుపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - టి.నరసాపురం

పామాయిల్ సాగు రైతులు చాపకింద నీరులా వ్యాపిస్తున్న గానొడెర్మా తెగులుపై అప్రమత్తంగా ఉండాలని మండల ఉద్యానవన శాఖాధికారి జి.లక్ష్మి సూచించారు. మండలంలోని సీతంపేటలో గురువారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు పామాయిల్ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గానొడెర్మా తెగులుకు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కోకో ఫీల్డ్ ఆఫీసర్ దేముడుబాబు మాట్లాడుతూ పామాయిల్, కోకో సాగు ద్వారా మంచి దిగుబడితో పాటు ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆఫీసర్ అరవింద్, దుర్గాప్రసాద్, సర్పంచి నాళం టిరీషా, కాశివిశ్వేశ్వరావు, పాపోలు పూర్ణ, వాసిరెడ్డి రామ్మోహన్, బలుసు రవి పాల్గొన్నారు.

'మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం'

ప్రజాశక్తి - కలిదిండి

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో ఎన్ఆర్‌జిఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను ఆయన పరిశీలించారు. గ్రామాల్లోని రోడ్లన్నీ విడతల వారీగా ఐదేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కోకా తాతయ్య, దున్నా సత్యన్నారాయణ, తరగల శ్రీను, భీమయ్య, పిల్లారిశెట్టి ఏసు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హేమంత్ కుమార్, కాంట్రాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

'మతం మారిన వారిని ఎస్‌సిలుగా గుర్తించడం తగదు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మతం మారిన హిందువులను ఎస్‌సిలుగా గుర్తించటం కుదరదని సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో దళిత క్రిస్టియన్లను ఎస్‌సిలుగా గుర్తిస్తూ చట్టం చేయాలని కెవిపిఎస్ ఏలూరు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సురేష్, ఎ.ఫ్రాన్సిస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మతం మారినంత మాత్రాన కులవివక్ష పోలేదని, అంటరానితనం కొనసాగుతూనే ఉందని, కులదురంకార దాడులు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. భారత రాజ్యాంగంలో దళితులకు కల్పించిన మౌలిక హక్కులను మతంతో నిమిత్తం కాకుండా అందరికి వర్తించేలా చట్టాన్ని సవరించాలని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఆగిరిపల్లి :ప్రస్తుత సమాజంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు తమ నాయకత్వ సామర్థ్యాన్ని మెరుగు పర్చుకోవాలని విద్యాశాఖ జోన్–2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి అన్నారు. మండల పరిధిలోని తోటపల్లి హీల్ ప్యారడైజ్‌లో జరుగుతున్న ఆరు రోజుల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయుల స్కూల్ లీడర్‌షిప్ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని, విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించటంతో పాటు, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని, సోషల్ మీడియా ప్రభావం విద్యార్థులపై పడకుండా వారికి నిరంతరం కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. అనంతరం శిక్షణ పొందుతున్న ప్రధానోపాధ్యాయుల తరపున హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు కోనేరు సత్యప్రసాద్‌కు రూ.లక్ష విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.లక్ష్మమ్మ, రాష్ట్ర పరిశీలకురాలు శ్రీలత, ఏలూరు జిల్లా ఎఎంఒ రెడ్డి రామారావు, ఆగిరిపల్లి ఎంఇఒ కె.ఆనంద్‌కుమార్, హీల్ సిఇఒ కె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

10న నూజివీడు ఆర్‌జియుకెటిలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటి క్యాంపస్‌లో (టిహన్) ఐఐటి హైదరాబాద్‌తో కలిసి ఐఒటి, రోబోటిక్స్ ఫర్ అటానమస్ నావిగేషన్ సిస్టమ్స్‌పై స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆర్‌జియుకెటి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించనున్నారు. ఒక వారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ డిసెంబర్ పదో తేదీ నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. ఇందులో దాదాపు 50 మంది అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. రెండో సారి 400 మంది విద్యార్థుల కోసం విద్యార్థి అభివృద్ధి కార్యక్రమం నాలుగు క్యాంపస్‌లలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే ఇతర కళాశాలల అధ్యాపకులు రిజిస్ట్రేషన్ వివరాల కోసం జి.సౌమనాథ్, 9949860571 సంప్రదించవచ్చు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్లు ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్, డైరెక్టర్. ఇసిఇ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రియాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

బడుగు, బలహీన తరగతుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

ప్రజాశక్తి - చింతలపూడి

బడుగు, బలహీన తరగతుల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ కొనియాడారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎంఎల్ఎ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, చింతలపూడి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడా అనీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏలూరు :ఈ నెల 19వ తేదీన ప్రారంభమై 30వ తేదీ వరకు జరిగే దేశభక్తి రాజ్యాంగం పేరుతో చైతన్య సదస్సుల కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సదస్సు నిర్వహించారు. జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి, ఎంగెల్స్ 204వ జయంతి కార్యక్రమాలు కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ గిరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. అతిథులుగా హాజరైన బోఫ్ జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1827లో పూనెలో జన్మించిన పూలే సామాజిక న్యాయం గురించి కృషికి ఆద్యుడు అయ్యాడన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఫ్రెడరిక్ ఎంగెల్స్ జీవిత కృషి వివరించారు. రాజ్యాంగంపై నిర్వహించిన ప్రశ్నవలి పోటీలో బహుమతి పొందిన ఎస్‌కె.అబ్దుల్ మదీన్, కె.పూర్ణకుమారి, కె.లోకేష్‌కుమార్, ఎం.అవంతి, జె.రంజిత్‌కుమార్, కె.వెంకటలహరి, జీవన్, నవ్య, వెంకటేష్, కృపా జ్యోతిలకు రాజ్యాంగం పుస్తకాలు, ప్రశంసాపత్రాలు అందించారు.

మండవల్లి :బడుగు బలహీన తరగతుల హక్కులకే పోరాడి అండగా నిలిచిన పోరాటయోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు శాంతరాజు, గౌరవ అధ్యక్షులు భాస్కరరావు అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే 131వ వర్ధంతిని అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి రవి, ఒట్టిప్రోలు సుధీర్, దాకారపు వినోద్ కుమార్, గోరింక గాంధీ, మెండ సురేష్, పి.ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు : జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. గుండుగొలనులో నిర్వహించిన కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలనువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 19వ శతాబ్దానికి చెందిన సంఘసంస్కర్తలు రైతుల గురించి పోరాడిన ఏకైక సంస్కర్తగా జ్యోతిరావు పూలే గుర్తింపు పొందారున్నారు. ఈ కార్యక్రమంలో జి.మురళీ, సిరిబత్తిన కొండబాబు, వగ్వాల అచ్యుతరామయ్య, బివి.రమణమూర్తి పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, మహిళల ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు మాట్లాడారు.

ముదినేపల్లి : ముదినేపల్లిలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ నిర్మాణ కమిటీ గౌరవ అధ్యక్షులు పడమట కారవెంకటరమణ, పళ్లెం పుణేశ్వరావు ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు జ్యోతిరావు పూలే జీవిత విశేషాలు, చేసిన త్యాగాలు, సంఘ సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో జన్ను వీర వెంకటేశ్వరరావు, ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, ఈడే శ్రీనివాసరావు,

CHANGE OF NAME

I, **GUNDUGOLLU CHANDRA SEKHAR** S/o. GUNDUGOLLU MAHANKALI R/o.D.No. 15-9, Pedapeta, Near Church, Undi Village, Undi Mandal, West Godavari District (A.P) - 534199. I have changed my name from GUNDUGOLUNU SEKHAR (Old Name) to **GUNDUGOLLU CHANDRA SEKHAR** (New Name) S/o GUNDUGOLLU MAHANKALI.

పత్రికా ప్రకటన

నా క్లయింటు లోయ రంగారావు అను వారు ది.18.09.2020వ తేదీన ఏలూరు జిల్లా, ఏలూరు నగరం, పడమరవీధి, చ.గ.130.0.0లు స్థలమును గు।ం శివకుమార్ గారి నుండి క్రయం పొంది ఏలూరు రిజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు నెం.6396/2020రుగా సంక్రమించిన ఆస్తికి సంబంధించి లింకు దస్తావేజు యొక్క ఒరిజినల్ దస్తావేజు నెం.2360/2018 ఇల్లు మారుతున్న సమయంలో పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల నాకు గానీ నా క్లయింటుకు గాని అప్పగించగలరు.

కె.వి.పి.మాధవరావు, అడ్వకేట్ & నోటరీ
సెల్: 9440111033

బహిరంగ ప్రకటన

ప.గో.జిల్లా, పాలకొల్లు పట్టణం, పాలకొల్లు బ్రాడీపేటకు చెందిన గుబ్బల పార్థసారథి S/o.సత్యనారాయణ గారు మాకు యిచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా.. మా క్లయింటు పెనుమదం గ్రామం నుండి పాలకొల్లు వస్తుండగా తన మోటార్‌సైకిల్‌లో పెట్టుకున్న కాగితములు ఉన్న కవరు పడిపోయినది. కవరులో ఉన్న కాగితాలు వివరములు :
1.0012209550 నెంబరు గల 100/– ఖాళీ NJ స్టాంపు పేపరు సంతకం చేసి ఉన్నది.
2.0012209551 నెంబరు గల 100/– ఖాళీ NJ స్టాంపు పేపరు సంతకం చేసి ఉన్నది.
3.8282 నెంబరు గల 22/5/2024 తేది 10/– ఖాళీ NJ స్టాంపు పేపరు సంతకం చేసి ఉన్నది.
4.8283 నెంబరు గల 22/5/2024 తేది 10/– ఖాళీ NJ స్టాంపు పేపరు సంతకం చేసి ఉన్నది.
5.781431 నెంబరు గల SBI, Palakol బ్యాంకు ఖాళీ చెక్కు సంతకం చేసి ఉన్నది.
6.781465 నెంబరు గల SBI, Palakol బ్యాంకు ఖాళీ చెక్కు సంతకం చేసి ఉన్నది.
7.రెండు ఖాళీ ప్రాంశరీనోట్లు – సంతకం చేసి ఉన్నవి.
పై కాగితములు గల కవరు మా క్లయింటు తన స్నేహితుని వద్ద బాకి తీర్చివేసి తెచ్చుకొనుచుండగా కవరుతో సహా మోటార్‌సైకిల్ వేగంలో పడిపోయినవి. దొరికిన వారు మా క్లయింటు ఫోన్ నెంబరు 9441429824 గాని, ఈ క్రింది న్యాయవాది నెంబరుకు గాని తెలుపగలరు. అందజేసిన వార్కి మంచి బహుమతి ఇవ్వబడుతుంది. మా క్లయింటు పోగొట్టుకున్న కాగితములు ఎవరైన Miss use చేసిన యెడల మా క్లయింటుతీసుకునే సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.
పాలకొల్లు — అప్పారి హరిబాబు
ది.28–11–2024 — న్యాయవాది, రాజోలు.

In the Court of the III Addl. District Judge : Nellore
O.S.No. 49 / 2023
1. **M/s. DR Hotels & Resorts,** Nellore, Rep.by its Managing Partner **K.Dhanunjaya Reddy**
2. **M/s. DR Hotels & Resorts,** Nellore, Rep.by its Managing Partner **K.Deepakram Reddy** - Plaintiffs
Vs
1. **Ruddaraju Jithendra Srinivasa Varma** & 11 Others - Defendants
Notice
To,
D7. Penumathsa Venkata Krishnam Raju, S/o Rama Chandra Raju, resident of D.No.2-12-13/1, Ramaraju Thota, Sivarao Pet, Bhimavaram, West Godavari District.
D8. Penumathsa Hema Venkata Naga Swapna, W/o Venkata Krishnam Raju, resident of D.No.2-12-13/1, Ramaraju Thota, Sivarao Pet, Bhimavaram, West Godavari District.
పై నెంబరున వాదులు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే10-12-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఆర్.ఎన్.సునీత
వాదుల తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the III Addl. District Judge : Nellore
I.A.No. 510 / 2023
O.S.No. 49 / 2023
1. **M/s. DR Hotels & Resorts,** Nellore, Rep.by its Managing Partner **K.Dhanunjaya Reddy**
2. **M/s. DR Hotels & Resorts,** Nellore, Rep. by its Managing Partner **K.Deepakram Reddy** -Petitioners/ Plaintiffs
Vs
1. **Ruddaraju Jithendra Srinivasa Varma** & 11 Others - Respondents / Defendants
Notice
To,
R7. Penumathsa Venkata Krishnam Raju, S/o Rama Chandra Raju, resident of D.No.2-12-13/1, Ramaraju Thota, Sivarao Pet, Bhimavaram, West Godavari District.
R8. Penumathsa Hema Venkata Naga Swapna, W/o Venkata Krishnam Raju, resident of D.No.2-12-13/1, Ramaraju Thota, Sivarao Pet, Bhimavaram, West Godavari District.
పై నెంబరున పిటిషనర్లు / వాదులు తాత్కాలిక ఇంజంక్షన్ ఉత్తర్వులు కోరుతూ పై తెలిపిన కోర్టులో మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ లో మీకు నోటీసు నిమిత్తం **తే10-12-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఆర్.ఎన్.సునీత
పిటిషనర్లు / వాదుల తరపు అడ్వకేట్, నెల్లూరు.